

నూతనంగా ఎన్నికైన కేసీఆర్ నగర్ కాలనీ యూత్ కమిటీ సభ్యులు

## కేసీఆర్ నగర్ కాలనీ యూత్ కమిటీ ఎన్నిక

కృష్ణకాలనీ, డిసెంబర్ 2 : భూపాలపల్లి మున్సిపాలిటీ 11వ వార్డులోని కేసీఆర్ నగర్ కాలనీ (డబుల్ బెడ్రూం) యూత్ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగులోతు అంజి, ఉపాధ్యక్షుడిగా బానోత్ తరుణ్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ హేమంత్, కార్యదర్శులుగా లావుడ్యా రాహుల్, నంగావత్ రాజన్, భూక్యా రాకేశ్, నంగావత్ తరుణ్, భూక్యా హరీశ్, ముఖ్య సలహాదారులుగా నంగావత్ జ్ఞానేందర్, భూక్యా సమ్ములాల్, బానోత్ రాజేశ్, బానోత్ నితిన్, గుగులోత్ శ్రావణ్, అజ్మీరా విష్ణు, కమిటీ సభ్యులుగా అఖిల్, దేవేందర్, తరుణ్, హరీశ్, గణపతి, బన్ని, ఆదిశ్, సునీల్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ యూత్ నాయకులు బానోత్ మహేశ్వర్, భూక్యా రాజ్ కుమార్, అజ్మీరా తిరుపతి, నంగావత్ జగపతి తదితరులు పాల్గొన్నారు.



గర్భిణికి టీకా వేస్తున్న ఏఎన్ఎం

## గర్భిణులకు టీకాలు

మహదేవపూర్, డిసెంబర్ 2 : మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం గర్భిణులు, ఐదేండ్ల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. క్రమం తప్పకుండా సకాలంలో వ్యాక్సినేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూరారం పల్లె దవాఖాన డాక్టర్ సముద్రాల విజయ్ కుమార్, హెల్త్ సూపర్ వైజర్ మాషూక్‌అలీ, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎంలు కనకదుర్గ, శ్రీదేవి, శ్రీలత, ఆశ కార్యకర్తలు సారక్క తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

## నవాబుపేటలో చిన్నారులకు..

చిట్యాల, డిసెంబర్ 2 : మండలంలోని నవాబుపేటలో చిన్నారులకు రోగనిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. చిన్నారులకు న్యూమోనియా, పోలియో, గోరంత, క్షయ, చికెన్‌పాక్స్ వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత టీకాలను వినియోగించుకోవాలని ఏఎన్ఎంలు సుమలత, జయప్రద సూచించారు. పుట్టిన బిడ్డ నుంచి 16 ఏళ్ల వయస్సు వచ్చే వరకు పలు విడుతలుగా ప్రభుత్వం టీకాలు పంపిణీ చేస్తున్నదన్నారు. టీకాలతో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## వృద్ధుడి ఆత్మహత్య



గౌరయ్య(ఫైల్)

చెన్నారావుపేట, డిసెంబర్ 2: వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బోజెర్వు గ్రామంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాధారపు గౌరయ్య(70) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆరోగ్యం బాగా లేకపోవడం, ఇతర సమస్యల కారణంగా కొంతకాలం నుంచి మానసింగా కుంగిపోతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన గౌరయ్య శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కుమారులు, బంధువులు వెతుకగా, తన పొలం వద్ద శనివారం ఉదయం చెట్టుకు వేలాడుతూ మృతదేహం కనిపించింది. యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.



చలువ పందిళ్ల కింద భక్తుల సందడి



జీడికల్‌లో వెలసిన దుకాణాల వద్ద భక్తులు

# ఘనంగా దివ్య విమాన రథోత్సవం

- కొనసాగుతున్న జీడికల్ జాతర
- భారీగా తరలివచ్చిన భక్తులు


లింగాలఘనపురం, డిసెంబర్ 2 : జనగామ జిలాలా లింగాలఘనపురం మండలంలోని జీడికల్ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం జాతర కొనసాగింది. ఈ ఉత్సవాల్లో కీలకమైన దివ్య విమాన రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో నిత్యాహవ నం, ద్వారాతోరణపూజ, ఆరగింపు తీర్థగోష్ఠి, సా యంత్రం నిత్యాహవనం చేపట్టారు. గర్భగుడి ఎదుట దివ్యవిమాన రథాన్ని తీసుకొచ్చి, అరటి, కొబ్బరి మట్టలు, మామిడి తోరణాలు, వివిధ పూలతో సుందరం గా అలంకరించారు. రంగురంగుల విద్యుద్దీపాల తోరణాలను ఏర్పాటు చేయడంతో దివ్యవిమాన రథానికి కొత్త శో భ కొట్టొచ్చినట్లు కనిపించింది. ఆలయంలో ఉన్న సీతాదేవి, శ్రీరామచంద్రస్వామి, లక్ష్మణమూర్తి, ఆంజనేయస్వామి విగ్రహాలను పూజారులు మేళాతాళాలకు అనుగుణంగా నృత్యం చేస్తూ, చేతులపై మోసుకొస్తూ దివ్యవిమాన రథంపైకి చేర్చారు. రథం ఎదుట బలి హోమం నిర్వహించి, భక్తులు తాళ్లతో లాగుతుండగా, రథయాత్ర మాడ వీధిగుండా అంగడి బజారు వరకూ, తిరుగు ప్రయాణంలో అంగడి బజారునుంచి మాఢవీధుల గుండా ఆలయం గర్భగుడి ఎదుట వరకూ కొనసాగింది. రథంపై ఉన్న విగ్రహాలను మేళతాళాల మధ్య పూజారులు చేతులపై మోస్తూ, నృత్యం చేస్తూ యథాస్థానంలో విగ్రహాలను చే ర్చారు. అనంతరం ఆరగింపు తీర్థగోష్టితో కార్యక్రమాలు ముగిసాయి. కార్యక్రమంలో పూజారులు భార్గవాచార్యు లు, మురళీకృష్ణమాచార్యులు, రాఘవాచార్యులు, ఆచార్యవర్చిష్, బుచ్చయ్యశర్మ, ఈవో శేషభారతి, సిబ్బంది కేకే రాములు, భరత్‌కుమార్, మల్లేశ్ పాల్గొన్నారు.




రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

## మేడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శన

కాటారం, డిసెంబర్ 2 : మండలంలోని మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ప్యానల్ బృందం శనివారం సందర్శించింది. ఉపాధ్యాయుల బోధనా తీరు, నమూనా తరగతి బోధన, విద్యార్థుల నోట్ పుస్తకాలు, పరీక్ష పత్రాలు, రికార్డులు, పాఠ్య ప్రణాళికలు, టీచింగ్ డైరీలు, పలు రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. లోటుపాట్లను గుర్తించి తగు సూచనలు చేశారు. విద్యార్థునులకు అందిస్తున్న భోజన నాణ్యత, మెనూ, డైనింగ్ హాల్, వంట గది, డార్మిటరీ భవనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రవి శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాల వాతావరణం, ఉపాధ్యాయుల పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. క్రీడలలో రాణిస్తున్న విద్యార్థినులు, కోచ్‌ను అభినందించారు. సందర్శించిన వారిలో ప్యానల్ టీం హెడ్ కే శ్రీనివాస్, వై సమ్మయ్య, కే మాధవరావు, కే సమ్మయ్య, ఎస్ బుచ్చయ్య, విజయలలిత, కృష్ణ తదితరులున్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్యానల్ బృందం



ఆలయంలో పూజలు చేసిన అనంతరం బీఆర్ఎస్ నాయకులు

## గండ్ర గెలవాలని ప్రత్యేక పూజలు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 2 : భూపాలపల్లి మున్సిపాలిటీలోని మంజూర్‌నగర్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం బీఆర్ఎస్ భూపాలపల్లి అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడోసారి ఎమ్మెల్యేగా గండ్ర గెలిచి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని వారు కోరుకున్నారు. కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ ముంజంపెల్లి మురళీధర్, భూపాలపల్లి టౌన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటకం జనార్దన్, చుక్క బాలరాజు గౌడ్, కట్ట నరసింహాచారి, భాస్కర్, సుధాకర్, పుల్యాల తిరుపతి, రాజు, నిమ్మల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా పోలీసుల తనిఖీలు

కాటారం, డిసెంబర్ 2 : పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. మండల కేంద్రంలోని చింతకాని క్రాస్ వద్ద ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకొని వదిలిపెట్టారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై అభినవ్ కోరారు.

## యువకుడి ఆత్మహత్య

చిల్పూరు, డిసెంబర్ 2 : మండలంలోని లింగంపల్లికి చెందిన మోతె సాయికిరణ్ (20) శనివారం గ్రామంలోని జంపన్నవాగు ఒడ్డున చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ విఫలమై ఆత్మహత్యకు పాల్పడినట్లుగా మృతుడి తల్లి మోతె స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై బొల్లం వినయ్ కుమార్ తెలిపారు.

# అర్ధరాత్రి మద్యం షాపు యజమాని వీరంగం

- జనావాసాల మధ్య దుకాణం వద్దన్నందుకు..
- రహదారిపై బాటిళ్లు పగలగొట్టిన వైనం

ములుగు, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు ముందు అర్ధరాత్రి సంబంధిత యజమాని నరేందర్‌రెడ్డి వీరంగం సృష్టించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌లో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పాత రైస్ మిల్లు వద్ద నూతన మద్యం షాపును ఏర్పాటు చేస్తున్నారు. కాలనీ వాసులు ఈ ప్రాంతంలో దుకాణం పెట్టొద్దని కొన్ని రోజులుగా చెబుతున్నారు. కాగా, శుక్రవారం అర్ధరాత్రి షాపుకు చేరుకున్న మద్యాన్ని అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో కాలనీవాసులు అడ్డు చెప్పారు. తమకు ఇబ్బందులు కలుగుతాయని మండిపడ్డారు. దీంతో షాపు యజమాని కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేసేందుకు డీసీఎంలో ఉన్న బీర్ల సీసాలను జాతీయ రహదారిపై పగులగొట్టి వీరంగం చేశాడు. శనివారం కాలనీవాసులు మాట్లాడుతూ షాపు ఏర్పాటు చేయడంవల్ల మందు బాబులు తమ ఇండ్ల వైపుగా వచ్చి ఇబ్బంది పెడతారని చెప్పినందుకు షాపు యజమాని రౌడీలాగా ప్రవర్తించాడన్నారు. షాపు ప్రారంభించిన తర్వాత సీసాలను తమ ఇం డ్ల మీద విసిరే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజుల క్రితం ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశామని, వారు పట్టించుకుంటే ఇలా జరిగేది కాదన్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐని వివరణ కోరగా కాలనీవాసుల ఫిర్యాదు మేరకు షాపు అక్కడ ఏర్పాటు చేయొద్దని చెబితే యజమాని వినడం లేదన్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బీరు సీసాలను జాతీయ రహదారిపై పగులగొడుతున్న యజమాని